సీఎం రేవంత్‌రెడ్డి కోస్గి పర్యటన వాయిదా

కోస్గి రూరల్, ఫిబ్రవరి 17: నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని కోస్గిలో ఆదివారం జరగాల్సిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి పర్యటన వాయిదా పడింది. కోస్గిలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కానీ, అనివార్య కారణాలతో ముఖ్యమంత్రి పర్యటన వాయిదాపడినట్లు అధికారులు తెలిపారు. త్వరలో పర్యటన తేదీని ప్రకటిస్తామన్నారు. రెండో సారి కూడా సీఎం పర్యటన వాయిదా పడటంతో ఆయన నియోజకవర్గ ప్రజలకు నిరాశ మిగిలింది. ఇప్పటికే అభివృద్ధి కార్యక్రమాలు ఉధృతంగా చేపడుతుండగా సీఎం వస్తే మరింత వేగం పెరుగుతుందని స్థానికులు ఆశిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ నెల 21న సీఎం పర్యటన ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

నాణ్యత నగుబాటు

- అభివృద్ధి పనుల బిల్లుల్లో చేతివాటం
- పాలమూరు పురపాలికలో అధికారులు, పాలకులకు పర్సెంటేజీ
- కింగ్‌మేకర్‌లా ఓ వర్క్‌ఇన్‌స్పెక్టర్



పాలమూరు పురపాలిక కార్యాలయం

మహబూబ్ నగర్, ఫిబ్రవరి 17: తిలాపాపం తలా పిడికెడు అన్నట్లుగా పాలమూరు మునిసిపాలిటీలో అందరూ పర్సెంటేజీలు తీసుకుంటూ నాణ్యతకు తిలోదకాలిస్తున్నారు. కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు మనిషి మనిషికి ఒక రేటును ఫిక్స్ చేసి డబ్బులు దండుకుంటున్నారు. అధికారులు, నాయకులు, కాంట్రాక్టర్ ఇలా అందరూ ఏకమై పనుల పర్యవేక్షణ గాలి కొదిలేశారు. ఏ శాఖలోనైనా పర్సెంటేజీలు తీసుకోవడం బహిరంగ రహస్యమే అయితే.. 10-12 శాతం వచ్చిన బిల్లులో పర్సెంటేజీలు ముట్టజెప్పాల్సి ఉంటుంది. కానీ పాలమూరు పురపాలికలో మాత్రం ఏకంగా 20-22 శాతం పర్సెంటేజీలు ఇచ్చుకోవాల్సి వస్తోంది. అధికారి స్థాయి, వార్డుల సంఖ్యను బట్టి పర్సెంటేజీని నిర్ణయించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్, ఏఈ, డీఈ, ఎంఈ, కమిషనర్ సెక్షన్ క్లర్క్, అకౌంట్ సెక్షన్, ఇక కౌన్సిలర్ టూ ఛైర్మన్ వరకు ఇలా ఒక్కొక్కరి స్థాయిని బట్టి 0.5 పర్సెంటేజీ నుంచి 3-4 పర్సెంటేజీ వరకు ఇచ్చుకోవాల్సి ఉంటుంది. కొందరు అధికారులు హైదరాబాద్‌కు కాంట్రాక్టర్‌లను పిలిపించుకుని అక్కడే డబ్బులు తీసుకుంటారన్న ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్ 20 శాతం చెల్లించాలంటే అతనికి మరో 20 శాతం మార్జిన్ ఉండేలా చూడాలి. అంటే లక్ష రూపాయల ఖర్చుతో చేయాల్సిన పనులు రూ.60 వేలులోపే పూర్తిచేయాల్సి ఉంటుంది. అందుకే అధికారులు చూసీచూడ నట్లుగా వ్యవహరిస్తున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీ పనులు జరిగేటపుడు అధికారులు, వర్క్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. డీఈ, ఎంఈ పనులను పరిశీలించాల్సి ఉంటుంది. చాలా పనులను యంత్రాంగం నామమాత్రంగా తనిఖీలు చేయడంతో కాంట్రాక్టర్‌లు ఇష్టానుసారంగా పనులు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. పనులు పూర్తైన తరువాత ఎంబీ రికార్డ్ చేసే ముందు క్వాలిటీ కంట్రోల్ అధికారులు వచ్చి సీసీరోడ్డు ఎంత మందంలో వేశారో అనే విషయమై రహదారిపై ర్యాండమ్‌గా తవ్వి శాంపిల్స్ సేకరించేవారు. ఇప్పుడు క్వాలిటీ కంట్రోల్ ఎక్కడా ఇలాంటి పని చేయడం లేదని స్పష్టమవుతోంది.

వర్క్ ఇన్‌స్పెక్టర్ పాత్ర కీలకం..

పనులు జరిగేటప్పుడు అక్కడే ఉండి పనులు చూసుకునేందుకు ఏఈలు తమ కింద వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లను నియమించుకుంటారు. ఇలా పాలమూరు పురపాలికలో 5-6 మంది వర్క్‌ఇన్‌స్పెక్టర్‌లు పనిచేస్తున్నారు. ఒక్కొక్కరికి 8-10 వార్డుల బాధ్యతలు అప్పగించారు. వీరు పనిజరిగే చోట నిరంతర పర్యవేక్షణ చేస్తుండాలి. అలా కాకుండా దొంగలు దొంగలు కలిసి ఊళ్లు పంచుకున్నట్లు ఓ వర్క్‌ఇన్‌స్పెక్టర్ తన వార్డుల పరిధిలో జరిగే పనుల్లో కాంట్రాక్టర్‌తో జతకలిసి పెట్టుబడులు పెడుతూ తనూ కాంట్రాక్టర్ అవతారం ఎత్తారన్న ఆరోపణలున్నాయి. ఓ కౌన్సిలర్ బంధువు పేరిట పనులు తీసుకుని ఈ తతాంగం నడిపిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయం పసిగట్టిన కొందరు ఆ అధికారిని ఏసీబీకి పట్టించారన్న ప్రచారం జరుగుతోంది. మునిసిపాలిటీలో ఏళ్ళ తరబడి సాగుతున్న వ్యవహారం ఇప్పుడే ఎందుకు ఏసీబీ వరకు వెళ్లిందంటే ఇదే కారణమని పలువురు చర్చించుకుంటున్నారు. కాగా పురపాలికలో కాంట్రాక్టర్‌లు అధికారుల మధ్య పరస్పర సహకారం ఉంది. అందుకే పనులు నాణ్యత లేకుండా చేపడుతున్నా పట్టించుకునే పరిస్థితి లేకుండా పోయిందనే ఆరోపణలు ఉన్నాయి.

పట్టుతప్పుతున్న పాలన

- వనపర్తి మునిసిపాలిటీలో ఎవరికి వారే యమునా తీరే
- కమిషనర్ లేడు.. ఏఈ రావడం లేదు.. డీఈ ఉన్నా లేనట్లే
- పదవులు కాపాడుకోవడంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లు
- గాలికి వదిలిన పన్నుల వసూలు
- జనవరి నాటికి వసూలైంది 30.02 శాతం మాత్రమే



వనపర్తి పట్టణం

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 17: వనపర్తి జిల్లాలో ఉన్న ఐదు మునిసిపాలిటీల్లో వనపర్తి మేజర్ మునిసిపాలిటీ. ఆ మునిసిపాలిటీలో పాలన పట్టుతప్పుతోందని పలువురు కౌన్సిలర్లు విమర్శిస్తున్నారు. మునిసిపల్ కమిషనర్‌గా ఉన్న విక్రమసింహారెడ్డి ఇటీవలే బదిలీపై వెళ్లిపోయారు. ఆయన స్థానంలో మరో అధికారి ఇంతవరకు రాలేదు. వనపర్తి మునిసిపల్ కమిషనర్‌గా రావాలంటేనే కొందరు జంకుతున్నారని, దాదాపు ఐదుగురి పేర్ల తరువాత చివరికి మిర్యాలగూడ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న పూర్ణచందర్‌ను నియమిస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ కొత్త కమిషనర్ శనివారం వరకు విధుల్లో చేరలేదు. నెలరోజులుగా మునిసిపల్ ఏఈ తన వ్యక్తిగత కారణాలతో విధులకు రావడం లేదు. డీఈ ఉన్నా లేనట్లే.. ఆయన ప్రతీ రోజు హైదరాబాద్ నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో విధులకు సమయం కేటాయించలేకపోతున్నారు. రెవెన్యూ అధికారి ఐదు రోజులుగా దైవదర్శనాల్లో బిజీగా ఉన్నట్లు సమాచారం. ఆర్థిక సంవత్సరం ముగింపు దగ్గర పడుతున్న తరుణంలో మునిసిపాలిటీకి రావాల్సిన ఆదాయం రాబట్టాల్సిన అధికారి తనకేమి పట్టనట్లు తీర్థయాత్రలో ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమనే ఆరోపణలున్నాయి.

నిన్నటి వరకు పంచాయితే..

అధికారుల తీరు ఇలా ఉంటే పాలకవర్గ సభ్యుల తీరు మరోలా ఉంది. మునిసిపాలిటీలో ఉన్న 33 మంది కౌన్సిలర్లలో 23 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందినవారే ఉన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లను తొలగించేందుకు అవిశ్వాసం పెట్టాలని విశ్వ ప్రయత్నాలు చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు పరిపాలన వ్యవస్థను గాలికొదిలేసి తమ పదవులు కాపాడుకునే పనిలో నిమగ్న మయ్యారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను రూపంలో వనపర్తి మునిసిపాలిటీకి రూ.8.57 కోట్లు రావాల్సి ఉంది. కానీ ఈ ఏడాది జనవరి 31 నాటికి దాదాపు రూ. 2.57 కోట్లు మాత్రమే వసూలు చేశారు. అంతే కాకుండా మునిసిపాలిటీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లు, వీధి వ్యాపారుల కోసం ఏర్పాటు చేసిన డబ్బాల రూపంలో రూ.76 లక్షలు వసూలు కావాలి, కానీ జనవరి 31 నాటికి అవికూడా కేవలం రూ.16.86 లక్షలు మాత్రమే వసూలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఆదాయం రాబట్టడంలో కేవలం 30.02 శాతానికి మాత్రమే చేరుకున్నారు. వీటితో పాటు ట్రేడ్ లైసెన్స్ బిల్లులు, నల్లా బిల్లులు ఇలా అనేక ఆదాయ వనరులను సరైన రీతిలో వసూలు చేయించడంలో నాయకులు, అధికారులు విఫవలమయ్యారనే ఆరోపణలు వస్తున్నాయి..



మన్యంకొండ ఆలయం

ముస్తాబైన మన్యంకొండ

- రేపటి నుంచి లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు
- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- జాతరలో నిఘా కోసం సీసీ కెమెరాలు
- 24న రథోత్సవం



రథోత్సవానికి సిద్ధం చేస్తున్న తేరు

మహబూబ్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 17: పేదల తిరుపతిగా కొలిచే మన్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా ఫిబ్రవరి 24వ తేదీన రథోత్సవం (తేరు) ఉంటుందని ఆలయ ధర్మకర్త తెలిపారు. ఈ బ్రహ్మోత్సవాలను గతంలోకంటే వైభవంగా నిర్వహించాలని, భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ రవినాయక్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాలకు పూర్తయిన ఏర్పాట్లు

మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం కావడంతో భక్తులు అధికంగా వస్తారని అందుకు తగ్గట్లు ఏర్పాట్లు చేశారు. దేవాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. దర్శనానికి ఇబ్బంది లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులు స్నానమాచరించేందుకు కోనేరు వద్ద షవర్లు, నల్లాలు ఏర్పాటు చేశారు. దాసంగం షెడ్లు, విశ్రాంతి షెడ్లు అందుబాటులో ఉన్నాయి. జాతరలో 100 సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు ఏదైన అనారోగ్య సమస్య వచ్చినా.. ప్రమాదాలు జరిగినా.. అత్యవసర చికిత్స కోసం నాలుగు హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేశారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

దేవస్థానం వద్ద భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయం వద్ద కల్యాణ మండపం నిర్మాణం చేపట్టారు. అమ్మవారి ఆలయం నుంచి కొండపైకి బీటీరోడ్డు నిర్మాణం కోసం రూ.47 లక్షలు, నీటి వసతికి రూ.64 లక్షలు కేటాయించి పనులు చేపట్టారు. దుకాణ సముదాయాల నిర్మాణం, ముఖ ద్వార నిర్మాణం, రెండోఘాట్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. డబుల్ రోడ్డుతో పాటు నిత్య కల్యాణాల కోసం మరో కల్యాణ మండపం నిర్మించేందుకు నిధులు కేటాయించారు.

తాత్కాలిక ఉత్సవ కమిటీ ఎంపిక

మన్యంకొండ వేంకటేశ్వర స్వామి దేవస్థాన ఉత్సవ కమిటీని దేవదాయ శాఖ శనివారం ఎంపిక చేసింది. రెగ్యులర్‌గా ఉన్న దేవస్థాన పాలక మండలి కమిటీ పదవీకాలం పూర్తి కావడంతో తాత్కాలికంగా కమిటీని నియమించింది. ఈ కమిటీలో సభ్యులు గా గోవిందు, ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, వీరన్న, సురేందర్ తదితరులను తెలంగాణ దేవదాయశాఖ నియమించింది.



భక్తుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ సెంటర్ షెడ్డు



కోనేరులో ఏర్పాటు చేసిన షవర్లు



మహిళల కోసం ఏర్పాటు చేసిన స్నానాల గదులు

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్
- ప్రభుత్వ భూములు, లే అవుట్లపై ఆరా
- డ్వాక్రా సంఘాలు, ఐకేపీ సిబ్బందితో సమావేశం



సమీక్ష సమావేశంలో మహిళా సంఘం సభ్యుల సమస్యలు వింటున్న ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, కలెక్టర్ కోయ శ్రీహర్ష

కోస్గి రూరల్ ఫిబ్రవరి 17: కోస్గి పట్టణాభివృద్ధిపై అధికారులు, నాయకులు దృష్టి పెట్టాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్ సూచించారు. శనివారం ఆయన కోస్గి మునిసిపల్ కార్యాలయంలో నారాయణపేట కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ మయాంక్ మిట్టల్, స్థానిక అధికారులు, ఐకేపీ సిబ్బం దితో సమావేశం నిర్వహించారు. ప్రధానంగా మునిసిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల మాస్టర్‌ప్లాన్‌ను పరిశీలించారు. పట్టణంలో ఉన్న లే అవుట్లకు అనుమతులు ఉన్నాయా.. వర్షపునీరు కాలనీలకు వచ్చే అవకాశం ఉందా.. తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. గ్రామాల్లో మహిళా సంఘాలకు భవనాలు కావాలని సభ్యులు కోరారు.

పట్టణంలో ముఖ్యంగా రోడ్ల విస్తరణ, శివాజీ కూడలి వెడల్పు, సెంటర్ లైటింగ్, ఉప్పుసముద్రం, పరం చెరువు మినీ ట్యాంక్‌బండ్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. ప్రభుత్వ భూములు సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేశామని, మునిసిపాలిటీలో సుమారు రూ.165 కోట్లతో అభివృద్ధి పనులు చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామని వివరించారు. అనంతరం మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు, పలువురు నాయకులు మునిసిపాలిటీలో మిల్లులు, వ్యాపారులకు పన్నులు అధికంగా వేస్తున్నారని చెప్పడంతో పరిశీలిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ కమిషనర్ శశిధర్, ఆయా శాఖల ఏఈలు, డీఈలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు గోవర్ధన్‌రెడ్డి, ఇద్రిస్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రెండు, మూడు రోజుల్లో రెండు గ్యారెంటీలు

- ఉచిత బస్సు ప్రయాణం ఉపయోగించుకున్న 16 కోట్ల 50 లక్షల మంది మహిళలు
- జడ్చర్లలోనే బీజం పడిన కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం
- పాలమూరు న్యాయయాత్ర ముగింపు సభలో రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క



పాలమూరు న్యాయ యాత్ర ముగింపు సందర్భంగా జడ్చర్లలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

జడ్చర్ల, ఫిబ్రవరి 17 : అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని ప్రకటించిన విధంగా ఇప్పటికే నాలుగు గ్యారెంటీ పథకాలు అమలు చేశామని, మరో రెండు గ్యారెంటీ పథకాల ప్రారంభ తేదీని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. మహాలక్ష్మీ పథకంలో మహిళలు 16 కోట్ల 50 లక్షల పర్యాయాలు ఉచిత ప్రయాణం చేశారని వెల్లడించారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో శనివారం సాయంత్రం సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి చేపట్టిన పాలమూరు న్యాయయాత్ర ముగింపు సభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామంటూ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ జడ్చర్లలో ప్రకటించారని, నాడు పడిన బీజానికి నేడు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు చెప్పారు. పాలమూరు జిల్లాకు నీళ్లు రావాలని, అందుకు సంబంధించి ఎన్ని అడ్డంకులు సృష్టించినా జలయజ్ఞంలో మొదలు పెట్టిన ప్రాజెక్టులతో పాటు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి పంట పొలాలకు నీళ్లు పారిస్తామన్నారు. జడ్చర్ల నియోజకవర్గాన్ని సొంత శాసనసభ నియోజకవర్గంగానే భావిస్తానన్నారు. దశాబ్ద కాలం రాష్ట్రంలో పాలన చేసిన బీఆర్ఎస్ పార్టీ.. తెలంగాణ రాష్ట్రానికి ఎంత అన్యాయం చేసిందో తెలియంది కాదన్నారు. జలయజ్ఞంలో ప్రారంభించిన ప్రాజెక్టులను పూర్తి చేయకపోగా, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు వేల కోట్ల ఖర్చు పెట్టినా, ఒక్క ఎకరాకు నీరు అందించిన పాపాన పోలేదని ఆరోపించారు. రాజ్యసభకు వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ, మహబూబ్‌నగర్ ప్రజలకు నీళ్లు తీసుకురావడం కోసం ప్రజల మధ్యనే ఉంటానంటూ పాలమూరు న్యాయ యాత్ర చేపట్టిన వంశీచంద్‌రెడ్డిని అభినందిస్తున్నానన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన కోయిల్‌సాగర్, నెట్టంపాడు, భీమా, కల్వకుర్తి లిఫ్ట్, శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల మినహా ఏ ఇతర ప్రాజెక్టులతో మహబూబ్‌నగర్ జిల్లాకు నీరు రాలేదన్నారు. కృష్ణ నదిలో ఉన్న తెలంగాణ వాటాను నదితో పాటు వాటాను బోర్డుకు అప్పగించేది లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టంగా చెప్పిందన్నారు. ఉద్యోగస్థులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని పరిస్థితిని గత ప్రభుత్వం తీసుకువచ్చిందని, అందుకుభిన్నంగా 1వ తేదీనాడే ఉద్యోగులకు జీతాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రంలో రూ.40 వేల కోట్ల బిల్లులను పెండింగ్‌లో పెట్టారని, చేసిన పనులకు నిధులు ఇవ్వలేదని ఆరోపించారు. ధరణిలో జరిగిన అవకతవకలను సరిదిద్దేందుకు కోదండరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ వేశామన్నారు. కమిటీ ద్వారా రిపోర్ట్ తెప్పించి, నాడు పంచిన భూములను తిరిగి వాళ్లకే అప్పగిస్తామని, తు.చ. తప్పకుండా చేస్తామని జడ్చర్ల నుంచే మాట ఇస్తున్నామంటూ వెల్లడించారు. మూడు సంవత్సరాలలోనే కుంగి, కూలిపోయే పరిస్థితితో దేశంలోనే నిర్మించిన ఏకైక ప్రాజెక్టు మేడిగడ్డ అని, తెలంగాణ ప్రజలకు అవమానమని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు వైఎస్సార్ చేపట్టిన విధంగా ఇందిరా కాంత్రి పథకంను మళ్లీ తీసుకు వస్తామని, వడ్డీ లేని రుణాలను మహిళలకు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యతను నాయకులు, కార్యకర్తలు తీసుకో వాలని కోరారు. కార్య క్రమంలో సీడబ్ల్యూ సీ ప్రత్యేక ఆహ్వాని తుడు వంశీచంద్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మె ల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండు నెలల్లో 25వేల ఉద్యోగాలు భర్తీ చేశాం

- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి

రాజాపూర్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలల్లోనే 25వేల ఉద్యోగాలు భర్తీ చేశామని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి అన్నారు. పాలమూరు న్యాయ యాత్రలో భాగంగా శనివారం మండలంలోని రంగారెడ్డిగూడ, కల్లేపల్లి, ఇద్గాన్‌పల్లి. మల్లేపల్లి, రాజాపూర్ గ్రామాలలో యాత్ర కొసాగించారు. అనంతరం రాజాపూర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అర్హులందరికి ఇళ్లు, విద్యార్థులకు భరోసా కార్డులు ఇస్తామని, గృహలక్ష్మి, గృహజ్యోతి పథకాలు అమలు చేస్తామని అన్నారు. ఏడాదిలోపే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో డీసీసీ మాజీ అధికార ప్రతినిధి జనంపల్లి దుశ్యంత్‌రెడ్డి, అధికార ప్రతినిధి జహీర్‌అక్తర్, కృష్ణయ్య, నరహరి, యాదయ్య గోనెల రమేష్, విక్రమ్‌రెడ్డి, రఘువీర‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నసీర్‌బైగ్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కొనసాగుతున్న క్రీడా పోటీలు

అయిజ, ఫిబ్రవరి 17: గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని ఉత్తనూర్ గ్రామంలో ధన్వంతరి వేంకటేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా మూడు రోజులుగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. శనివారం ఎద్దుల బండలాగుడు పోటీలు, బాస్కెట్ బాల్ పోటీలు కొనసాగాయి. పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి రైతులు, యువకులు తరలివచ్చారు. కార్యక్రమంలో తిమ్మారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నీలడ్డి నాగరాజు, చిదంబర రెడ్డి పాల్గొన్నారు.



బాస్కెట్‌బాల్ పోటీలో తలపడుతున్న ఇన్‌కంటాక్స్ హైదరాబాద్, కర్నూల్ జట్లు

రథోత్సవం రమణీయం



పాలెం వెంకన్న రథోత్సవంలో పాల్గొన్న వేలాదిమంది భక్తులు



ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

బిజినేపల్లి, ఫిబ్రవరి 17 : అశేష భక్త జన సంద్రంలో వెంకన్న స్వామి రథోత్సవం హరి గోవిందనామ శరణు ఘోషల మధ్య భక్తి పారవశంతో రమణీయంగా కొనసాగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం పాలెంలోని అలువేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి రథోత్సవం (తేరు) మాఘరథసప్తమి శుక్రవారం ప్రారంభమై శనివారం తెల్లవారుజామున ముగిసింది. ఆలయంలో సాముహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, వేద పండితులైన బ్రాహ్మణులచే హోమాలు, స్వామివారికి ఉదయ కాల పూజలు, నిత్యారాధన, పుణ్యాహవచనం వంటి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా తీసుకెళ్లి రథంలోకి చేర్చారు. అనంతరం తేరుకు ఆలయ చైర్మన్ జున్న శేఖర్ రెడ్డి, ఈవో సీహెచ్.రంగారావు, ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ జి.లావణ్య నాగరాజు, ఆలయ స్థలదాత నారాయణరెడ్డితో ఆలయ ప్రధాన అర్చకులు కొరవి రామానుజచార్యులు ప్రత్యేక పూజలు చేయించి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథానికి రెండు వైపులా భక్తులు హరినామ స్మరణతో ముందుకు వెనకకు లాగారు. రథోత్సవానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ చైర్మన్ స్వంత ఖర్చులతో అన్నదానం చేశారు. అర్చకులు జయంత్, శుక్లా, చక్రపాణి ఆలయ కమిటీ సభ్యులు సొప్పరి బాలస్వామి, గంధం వెంకటేశ్వర్లు, గాడి సురేందర్, సిబ్బంది శివకుమార్, బాబయ్య, వలంటీర్లు జగదీష్, కొంకలి మధు, కొంకలి లోకేష్, వెంకటేష్, సొప్పరి శివ తదితరులు ఉన్నారు.

గాజరలో...

వంగూరు : రథసప్తమి పురస్కరించుకొని వంగూరు మండలంలోని గాజర గ్రామంలో శనివారం తెల్లవారుజామున వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద రథోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. భక్తులు వేలాదిగా తరలివచ్చారు. అందంగా పూలతో అలంకరించిన రథాన్ని ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై షైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్.. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై షైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా... సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై షైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాప్నికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్‌నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

కొనసాగుతున్న మట్టి దందా

» నల్లకుంటలోకి వందలాది టిప్పర్ల మట్టి

» శ్మశానవాటికను పూడ్చేస్తున్న అక్రమార్కులు



జడ్చర్ల పట్టణంలోని నల్లకుంట(పాత)లో వందలాది టిప్పర్‌ల మట్టితో నింపేసిన ప్రాంతం

జడ్చర్ల, ఫిబ్రవరి 17 : అక్రమంగా తరలించే మట్టి దందా కొనసాగుతూనే ఉంది. జడ్చర్ల పట్టణం నడిబొడ్డున ఉన్న నల్లకుంట ప్రాంగణంలోకి వందలాది టిప్పర్లతో మట్టిని దర్జాగా తరలివస్తున్నారు. గత ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి హయాంలో జడ్చర్ల పట్టణంలోని నల్లకుంటను మినీట్యాంకుబండ్‌గా నిర్మించారు. నల్లకుంట విస్తీర్ణం తగ్గడంతో మినీ ట్యాంక్ బండ్ నిర్మాణంతో ఆ ప్రాంగణంలో తేలిన భూమిని నేడు వందలాది టిప్పర్‌ల మట్టితో నింపేస్తున్నారు. వర్షం పడితే ఎగువ ప్రాంతం నుంచి దిగువకు వర్షపు నీరు, మురుగునీరు అధికంగా చేరి, ప్రధాన రహదారిపై నిలుస్తుండడంతో ప్రస్తుత పాలకవర్గం సభ్యులు భారీ మురుగుకాలువను నిర్మించారు. గౌడ ఫంక్షన్ హాల్ నుంచి మొదలుకుని మినీ ట్యాంక్‌బండ్‌ను ఆనుకుని నిర్మించిన మురుగుకాలువకు సమాంతరంగా మట్టితో నింపేస్తున్నారు. ఎన్నో సంవత్సరాలుగా అక్కడ ఉన్న శ్మశానవాటికను సైతం మూసే విధంగా మట్టిని నింపుతుండడంతో పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా మట్టి నింపుతున్న ఆ ప్రాంతం పట్టా భూమి అని, ఇటీవలే ఆ భూమిని విక్రయించడంతో కొనుగోలు దారులు భూమి లెవలింగ్ చేపడుతున్నారంటూ పరిసర ప్రాంతవాసులు తెలిపారు. శ్మశానవాటికను వదలకుండా మట్టిని నింపుతున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మట్టి తరలింపు ఎక్కడి నుంచి..?

వందలాది టిప్పర్ల మట్టిని ఎక్కడి నుంచి తీసుకువస్తున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. జడ్చర్ల మండలంలోని గొల్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ముదిరెడ్డిపల్లి వెళ్లే దారిలో గుట్టలను తవ్వి, పెద్ద పెద్ద గుంతలను మార్చిన వైనంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. జడ్చర్ల మండలంలోని శంకరాయపల్లి వెళ్లే రోడ్డులో ఉన్న గుట్టను, జడ్చర్ల హౌసింగ్ బోర్డు వెనక ప్రాంతంలో ఉన్న గుట్టను తవ్వి మట్టిని యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్నారు. ఇదిలా ఉండగా ఉదండాపూర్ రిజర్వాయర్ నుంచి సైతం మట్టిని అక్రమార్కులు రాత్రి వేళల్లో టిప్పర్లలో నింపుకుని పట్టణానికి తరలిస్తున్నారు. ప్రతి నిత్యం ఒక్కో ప్రాంతంలో వందలాది టిప్పర్‌ల మట్టి అక్రమంగా తరలుతున్నా, పట్టించుకోవాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో అక్రమార్కుల వ్యాపారం మూడు ట్రాక్టర్‌లు, ఆరు టిప్పర్లుగా మారింది.

మట్టి వ్యాపారంపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరా

గొల్లపల్లి రైల్వేస్టేషన్ నుంచి ముదిరెడ్డిపల్లి వెళ్లే దారిలో గుట్టను తవ్వి, గుంతలుగా మార్చారంటూ 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆరా తీశారు. ఏ మేరకు మట్టిని తోడేశారనే అంశంతో పాటు, ఎక్కడెక్కడ వ్యాపారం నిర్వహిస్తున్నారనే అంశంపై ఆరా తీసారు. అక్రమ మట్టి వ్యాపారంపై విచారణ చేపట్టాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

పీయూలో లా, ఇంజనీరింగ్ కోర్సులు ఏర్పాటు చేయాలి

» నల్ల బ్యాడ్జీలతో విద్యార్థుల ఆందోళన



నిరసన తెలుపుతున్న విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, ఫిబ్రవరి 17 : పాలమూరు యూనివర్సిటీలో లా, ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశ పెట్టాలని పీయూ జేఏసీ చైర్మన్ రాము డిమాండ్ చేశారు. శనివారం పీయూలో విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో పీయూలో లా, ఇంజనీరింగ్ కోర్సులు ప్రవేశపెట్టాలని నల్లబ్యాడ్జీలతో విద్యార్థులు ఆందోళన చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, పీయూ జేఏసీ, పీడీఎస్‌యూ, ఎస్ఎస్‌యూ, బీఆర్ఎస్వీ, ఎంఎస్ఎఫ్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

నేత్రదానం మహాదానం

» యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు

» యువకుడి నేత్రదానంపై కుటుంబీకులకు అభినందన



మృతుడు శివకుమార్ కుటుంబ సభ్యులను అభినందిస్తున్న కాగితాల మధు

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 17 : నేత్రదానం మహాదానమని యువశక్తి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాగితాల మధు తెలిపారు. మండలంలోని షాపూర్ గ్రామానికి చెందిన శివకుమార్ శుక్రవారం విద్యుదాఘాతంతో మృతి చెందడంతో అతని నేత్రాలను కుటుంబీకులు శనివారం ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌కు అందించారు. ఈ సందర్భంగా కాగితాల మధు మృతుడి కుటుంబీకులకు అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మరణానంతరం మరొకరికి చూపునిచ్చే అవకాశం పొందాలంటే నేత్రదానం చేయాలని అన్నారు. వ్యక్తి మృతి చెందిన ఆరు గంటలలోపు నేత్రదానం చేయడం వల్ల తాను చనిపోతూ కూడా మరొకరి జీవితాల్లో బతికి వెలుగులు నింపే అవకాశం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరు మరణానంతరం నేత్రదానం చేసి అంధులకు చూపును ప్రసాదించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలఆంజనేయులుగౌడ్, గ్రామ పెద్దలు మన్యంగౌడ్, ఐ క్లినిక్ గణేష్, శ్యామల, అంజనేయులు, సత్యన్న తదితరులు పాల్గొన్నారు.

నిప్పంటుకొని కాలి బూడిదైన ఈత వనం

ఉప్పునుంతల, ఫిబ్రవరి 17: నిప్పంటుకొని ఈతవనం కాలి బూడిదైన సంఘటన శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల పరిధిలోని జప్తీసదగోడు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మనోహర్ పొలంలో దాదాపు 200 ఈతచెట్లు ఉంటాయి. గొర్రెల కాపర్లు బీడీ తాగి పడేయడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది భారీగా చెలరేగిన మంటలు ఆర్పేందుకు కృషి చేశారు. అగ్నిప్రమాదంలో కొన్నిచెట్లు పూర్తిగా కాలిబూడిదైపోయాయి. ఎలాంటి హాని జరగలేదు. కొంతమేర ఆస్తినష్టం జరిగినట్లు స్థానికులు తెలిపారు.

పేలిన సిలిండర్.. తప్పిన ప్రమాదం

కొత్తకోట, ఫిబ్రవరి 17 : వనపర్తి జిల్లా కొత్తకోట పట్టణం దండుగడ్డ కాలనీలోని ఓ గుడిసెలో సిలిండర్ పేలింది. గుడిసెలో ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పింది. కాలనీలోని గట్టుయాదవ్ గుడిసెలో శనివారం సిలిండర్ పేలి మంటలు రావడంతో కాలనీవాసులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు మంటలను అదుపులోకి తెచ్చారు.

వాసవి సేవా సమితి రాష్ట్ర సభ్యురాలిగా డాక్టర్ దివ్య



వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 17 : వాసవి సేవా సమితి మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలిగా వనపర్తి పట్టణానికి చెందిన డాక్టర్ దివ్యను నియమించినట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు పూరి సురేశ్‌శెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సేవాగుణం కలిగిన దివ్య మూడేళ్లుగా పేదలకు ఎలాంటి రుసుము తీసుకోకుండా వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. గతంలో తమ సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన అనేక సేవా కార్యక్రమాల్లో తన వంతుగా దివ్య సహాయ సహకారాలు అందించిందని గుర్తు చేశారు. డాక్టర్ దివ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పజెప్పిన బాధ్యతను అంకితభావంతో నెరవేరుస్తూ ముందుకు వెళ్తానన్నారు. అవకాశం కల్పించిన సమితి చైర్మన్ టీజీ.వెంకటేష్, వ్యవస్థాపక అధ్యక్షుడు పూరి సురేష్‌శెట్టికి కృతజ్ఞతలు తెలిపారు.

'రాజ్యసభకు వాల్మీకుడి ఎంపికపై హర్షం'

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 17 : దేశంలోని వాల్మీకి సమాజానికి గౌరవం తీసుకొచ్చే విధంగా వాల్మీకి బిడ్డ బాలయోగి ఉమేష్‌నాథ్ మహారాజ్‌ను బీజేపీ ప్రభుత్వం రాజ్యసభకు ఎంపిక చేయడం హర్షణీయమని వాల్మీకి బోయ సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ మండ్ల దేవన్న నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రం ఉజ్జయిని పీఠాధిపతి అయిన బాలయోగి ఉమేష్‌నాథ్‌ను రాజ్యసభకు ఎంపిక చేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, జేపీ నడ్డా, అమిత్‌షాలు నిర్ణయం తీసుకోవడం వాల్మీకి బోయలకు దక్కిన గౌరవంగా భావిస్తున్నామని అన్నారు. అదే విధంగా వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. సమావేశంలో వాల్మీకి సంఘం నాయకులు కావలి బాలస్వామి నాయుడు, బుసిరెడ్డి స్వామి, నల్లపోతుల రవినాయుడు, ఎద్దుల రవినాయుడు, వంశీ తదితరులున్నారు.

న్యాయవాద సహకార సంఘం ఎన్నికల ఫలితాలు వెల్లడి



ఎన్నికైన డైరెక్టర్లు

మహబూబ్‌నగర్ లీగల్‌కంట్రిబ్యూటర్, ఫిబ్రవరి 17 : ఉమ్మడి జిల్లా న్యాయవాద సహకార సంఘం ఎన్నికల ఫలితాలు శనివారం రాత్రి విడుదల చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 18 మంది డైరెక్టర్లుగా పోటీపడగా వీరిలో 11 మందిని డైరెక్టర్‌లు ఎన్నుకున్నారు. వీరంతా కలిసి కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నారు. డైరెక్టర్‌లుగా కె.ఆనందరావుకు 269 ఓట్లు, టి.కరుణాకర్‌గౌడ్‌కు 237, కె.చంద్రమౌళికి 228, బి.పురుషోత్తంరావుకు 220, టి.వెంకట్రామశర్మకు 217, బి.కాంతరెడ్డికి 203, రోహిణి అయ్యంగార్‌కు 178, కె.సతీష్‌కుమార్‌కు 168, వి.గోపాల్ యాదవ్‌కు 162, మహ్మద్‌అజీజ్‌ఖాన్‌కు 151, వి.శ్రీరామ్‌కుమార్‌కు 148 ఓట్లు వచ్చాయి.

పాఠశాల పరిసరాల్లో చిరుత సంచారం

» విద్యార్థుల భయాందోళన



చిరుత సంచరించిన గార్లబండ తండా శివారులోని ప్రాథమిక పాఠశాల భవనం

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 17 : వనపర్తి జిల్లా ఖిల్లాఘనపురం మండలంలోని గార్లబండ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిసరాల్లో శనివారం చిరుత సంచారం చేయడంతో విద్యార్థులు భయాందోళనకు గురైనట్లు ఎంఈవో ఉషారాణి, పాఠశాల ఉపాధ్యాయుడు అమిన్‌రెడ్డి తెలిపారు. పాఠశాల తలుపులు మూసుకుని బిక్కుబిక్కుమంటూ విద్యాబోధన చేసినట్లు ఉపాధ్యాయుడు తెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో పాఠశాల సమీపంలో తండాకు చెందిన మన్యంనాయక్ ట్రాక్టర్‌పై వెళ్తూ ప్రత్యక్షంగా చిరుతను చూసి భయాందోళన చెందినట్లు తెలిపారు. పాఠశాల సమీపంలోని కుంట వైపు చిరుత వెళ్లినట్లు వివరించారు. తరచుగా జీవరాశులపై చిరుత దాడి చేస్తున్నా అటవీశాఖ అధికారులు చిరుతను బంధించడానికి సరైన ఏర్పాట్లు చేయడం లేదని తండావాసులు ఆరోపించారు. ఈ విషయంపై ఘనపురం ఫారెస్టు రేంజ్ అధికారి మంజులను వివరణ కోరగా.. గార్లబండ తండాలో చిరుత సంచారంపై సమాచారం అందిన వెంటనే అటవీ శాఖ అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారని, వివిధ ప్రాంతాల్లో చిరుత తిరగడం వల్ల బంధించలేకపోతున్నామని అన్నారు. చిరుత ఆహారం కోసం జీవరాశులను వేటాడుతుంది కానీ మనుషులను ఏమీ చేయదని అన్నారు. అటవీ ప్రాంతంలో చిరుత సంచరించడం సహజమని అన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్



వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 17 : వనపర్తి జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా ఎం.నగేష్ శనివారం మధ్యాహ్నం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన కలెక్టర్ తేజస్ నందలాల్‌పవార్‌ను కలిసి మర్యాదపూర్వకంగా పూలమొక్కను అందజేశారు. అనంతరం తన ఛాంబర్‌లోకి వచ్చి సంతకం చేసి బాధ్యతలు స్వీకరించారు. కాగా, వనపర్తి జిల్లాకు ఇటీవల అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా మహమ్మద్ అసదుల్లాను కేటాయించారు. మళ్లీ ఆయనను హెచ్‌ఎండీఏకు మార్చడంతో ఆయన స్థానంలో నగేష్‌ను నియమించారు.

డీఎస్పీ ఆనందరెడ్డి సేవలు చిరస్మరణీయం : ఎస్పీ



డీఎస్పీ ఆనందరెడ్డిని సన్మానిస్తున్న ఎస్పీ, ఏఎస్పీ

వనపర్తి క్రైమ్, ఫిబ్రవరి 17 : డీఎస్పీ ఆనందరెడ్డి సేవలు చిరస్మరణీయమని ఎస్పీ రక్షిత కె.మూర్తి అన్నారు. డీఎస్పీగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఆయనకు శనివారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ మాట్లాడుతూ వనపర్తి జిల్లాలో డీఎస్పీగా రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహించిన ఆనందరెడ్డి ఎన్నో పోలీస్ సమస్యలను తన అనుభవంతో పరిష్కరించారని కొనియాడారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నోడల్ అధికారిగా తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారని అభినందించారు. డీఎస్పీ ఆనందరెడ్డి మాట్లాడుతూ విధి నిర్వహణలో తోటి పోలీసులు, ప్రజలు, పాత్రికేయులు ఇచ్చిన సహకారం మరువలేనని అన్నారు. అనంతరం ఎస్పీ, అడిషనల్ ఎస్పీ శ్రీరామదాసు తేజావత్, జిల్లాలోని సీఐలు, ఎస్సైలు, సిబ్బంది డీఎస్పీని ఘనంగా సన్మానించారు. అదేవిధంగా నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావుకు జిల్లా పోలీసులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, సీఐలు నాగభూషణంరావు, రత్నం, శివకుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అప్పలనాయుడు, ఎస్సైలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో



ఎంపీడీవోను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెబ్బేరు, ఫిబ్రవరి 17 : బదిలీపై పెబ్బేరుకు వచ్చిన ఎంపీడీవో రవీందర్ శనివారం పదవీ బాధ్యతలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు పరిషత్ కార్యాలయానికి వెళ్లి ఎంపీడీవోను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు రోజా, విజయలక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్‌సాగర్, మాజీ సర్పంచు సురేందర్‌గౌడ్, గంధం రాజశేఖర్, శ్రీరం గాఫూర్ మండల నాయకులు బీరం రాజశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు వీరాస్వామి నాయుడు, నరసింహనాయుడు, రాముడు తదితరులున్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ చదువుకు దూరం కాకూడదు

» పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్



వార్షికోత్సవ సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లక్ష్మికాంత్ రాథోడ్

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 17 : విద్యార్థినీ, విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లో చదువుకు దూరం కాకూడదని పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్‌రాథోడ్ అన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్ హాల్లో సిద్ధార్థ డిగ్రీ కాలేజ్ విద్యార్థుల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరై, మాట్లాడారు. విద్యార్థులు ఊహల్లో ఉండకుండా కలల్ని సాకారం చేసుకోవాలని అన్నారు. ఆయన జీవిత అనుభవాల్ని విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎల్లస్వామి, డైరెక్టర్ వినీల బాలరాజు, వీఎస్ నాగేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులు సమయపాలన పాటించాలి

పాన్‌గల్, ఫిబ్రవరి 17 : విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించి నిత్యం పాఠశాలకు రావాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండల పరిధిలోని వెంగళాయిపల్లి ప్రాథమిక పాఠశాలను ప్రార్థనా సమయంలో ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల చేత ప్రార్థన చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని సూచించారు. అదేవిధంగా కేతేపల్లి భగత్‌సింగ్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల బోధన సామర్థ్యాలను, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పారిశుధ్యాన్ని పరిశీలించి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానికులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేష్‌యాదవ్, వెంకటేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లను నాణ్యతగా చేపట్టాలి

» పంచాయతీరాజ్ డీఈ ప్రమోద్ » పనుల పరిశీలన



సీసీ రోడ్లను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ ప్రమోద్

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 17 : గ్రామాల అభివృద్ధిలో భాగంగా ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో మంజూరైన సీసీ రోడ్లను నాణ్యతగా చేపట్టాలని పంచాయతీరాజ్ డీఈ ప్రమోద్ తెలిపారు. మండల కేంద్రంతో పాటు, అప్పారెడ్డిపల్లి, వెనికితండాలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్లను పంచాయతీరాజ్ డీఈ ప్రమోద్ శనివారం పరిశీలించారు. గ్రామాల్లో రవాణా వ్యవస్థ మెరుగుపడడానికి సీసీ రోడ్ల ఆవశ్యకత ఉందని అన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ క్యామరాజు, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వరరావు, జన్ను మధు, పంచాయతీరాజ్ ఏఈ కబీర్‌దాస్, పంచాయతీ కార్యదర్శి రవితేజరెడ్డి తదితరులున్నారు.

జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ పోటీలో

వనపర్తి జిల్లా విద్యార్థుల ప్రతిభ

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 17 : కేంద్ర ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరానికి గాను ఆన్‌లైన్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డు పోటీలో శనివారం వనపర్తి జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జిల్లా నుంచి 52 ప్రాజెక్టులు వివిధ పాఠశాలల నుంచి అప్‌లోడ్ చేశారు. పోటీలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే జడ్జిమెంట్ కూడా ఆన్‌లైన్‌లోనే నిర్వహించారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన జడ్జిమెంట్‌లో 52 ప్రాజెక్టులకు గాను 1:10 ప్రకారం సెలెక్ట్ చేశారు. అందులో మమత జడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాల కొత్తకోట, నిఖిల్‌కుమార్ జడ్పీహెచ్‌ఎస్ తిప్పడంపల్లి, రాఘవ జడ్పీహెచ్‌ఎస్ జూరాల, స్పైసీ బెస్ట్‌గ్రామర్ హైస్కూల్ కొత్తకోట, గీత జడ్పీహెచ్‌ఎస్ నాగపూర్ విద్యార్థులు ఎంపికయ్యారు. వీరిని జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు, జిల్లా సైన్స్ అధికారి ఎం.శ్రీనివాసులు, ఏఎంఓ మహానంది సీఎంవో యుగంధర్, ప్లానింగ్ కోఆర్డినేటర్ శేఖర్, జనరల్ అండ్ ఇక్విటి కోఆర్డినేటర్ శుభలక్ష్మి, జిల్లా సైన్స్ ఆఫీసర్ తిరుపతి, డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు చంద్రశేఖర్, గణేష్, విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది అభినందించారు. విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలో కూడా మంచి ప్రదర్శన కనబరిచి జిల్లాకు పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చర్యలు

» కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

» కలెక్టరేట్‌లో స్పెషల్ సమ్మరీ రివిజన్

» రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, ఫిబ్రవరి 17 : జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించుట, ఓటరు అవగాహన, పోలింగ్ స్టేషన్ల పేర్ల మార్పు వంటి అంశాలపై తీసుకున్న చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. తుది ఓటరు జాబితా వచ్చినప్పటికి డబుల్ ఓటర్, మరణించిన వారి పేర్లు తొలగించడం వంటి వాటిపై దృష్టి పెట్టినట్లు తెలిపారు. పొలిటికల్ పార్టీల ప్రతినిధుల దృష్టిలో ఇంకా ఏమైనా అంశాలు లేదా ఫిర్యాదులు ఉంటే చెప్పాలని కలెక్టర్ సూచించారు. ఓటరు జాబితా రూపకల్పన, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు వంటి అంశాల్లో ఎలాంటి సందేహాలు, ఫిర్యాదులు లేవని రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంతృప్తిని వ్యక్తం చేశారు. ఓటరు జాబితాను మునిసి పాలిటీ, మండలాల వారీగా వేరు చేసి ఇవ్వాలని కలెక్టర్‌ను కోరారు. ఇందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ బదులిచ్చారు.

మరమ్మతులో ఉన్న ఈవీఎంలు ఈసీఐఎల్‌కు తరలింపు

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో రిపేరులో ఉన్న 28 బ్యాలెట్ యూనిట్లు, ఒక కంట్రోల్ యూనిట్, 12 వీవీ ప్యాట్‌లను ప్రత్యేక వాహనంలో పోలీస్ భద్రత మధ్య హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ కంపెనీకి పంపించారు. ఇటీవల జరిగిన మొదటి స్థాయి ఈవీఎంల పరిశీలనలో వీటికి మరమ్మతు అవసరం ఉన్నట్లు గమనించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ఆర్డీవో పద్మావతి, రాజకీయ పార్టీల ప్రతినిధులు బీఆర్‌ఎస్ నుంచి సయ్యద్ జమీల్, ఎంఐఎం నుంచి రహీమ్, టీడీపీ నుంచి శంకర్, బీజేపీ నుంచి ప్రవీణ్, కాంగ్రెస్ నుంచి వేణాచారి, బీఎస్పీ నుంచి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే లేఅవుట్ అప్రూవల్

ప్రభుత్వ ఉత్తర్వు సంఖ్య 105ను అనుసరించి నిబంధనలు పాటిస్తేనే లేఅవుట్‌లు ఆమోదం పొందుతాయని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. శనివారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి లేఅవుట్ కమిటీ సమావేశం జరిగింది. టీఎస్‌బీపాస్ ద్వారా మొత్తం 11 దరఖాస్తులు రాగా వాటిని కమిటీ ద్వారా క్షుణ్ణంగా పరిశీలించారు. 11లో కేవలం రెండు మాత్రమే అన్ని నిబంధనలకు లోబడి ఉన్నందున ఆమోదించి మిగిలిన తొమ్మిది లేఅవుట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు డీటీసీపీ ద్వారా ఆమోదం పొందిన లేఅవుట్లలోనే ప్లాట్లు కొనాలన్నారు. అక్రమ లేఅవుట్‌లు, కచ్చా లేఅవుట్‌లలో ప్లాట్లు కొని సమస్యలు కొని తెచ్చుకోవద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఎం.నగేష్, ఈఈ పంచాయతీరాజ్ మల్లయ్య, ఇరిగేషన్ శాఖ నుంచి మధుసూదన్, విద్యుత్ శాఖ నుంచి నరేంద్రకుమార్, రోడ్లు భవనాల శాఖ నుంచి దేశ్యా, మునిసిపల్ కమిషనర్ విజయ్‌భాస్కర్, తహసీల్దార్లు యాదగిరి, లక్ష్మి తదితరులున్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

» ఉపాధ్యాయుల మధ్య అంతర్గత విభేదాలపై అదనపు కలెక్టర్ విచారణ



ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో మూత్రశాలలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 17 : మండల కేంద్రంలోని ఎస్టీ ఆశ్రమ పాఠశాలను లోకల్‌బాడీ అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని, పాఠశాల పరిసరాలను, విద్యార్థుల మూత్రశాలలు, మరుగుదొడ్లను పరిశీలించారు. పాఠశాలలోని ఉపాధ్యాయులతో వేర్వేరుగా సమావేశమై పాఠశాలలో జరుగుతున్న వ్యవహారాలపై వివరాలు సేకరించారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలానికి సంబంధించిన ఓటరు జాబితాలో సవరణలు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక గ్రంథాలయంలో పుస్తకాలను, వార్తా పత్రికలను, ప్రతీరోజు గ్రంథాలయానికి వచ్చే పాఠకుల రిజిస్టర్ ను పరిశీలించి, లైబ్రేరియన్‌కు పలు సూచనలు చేశారు. దొంతికుంటతండాలో పంచాయతీ కార్యాలయం రికార్డులను తనిఖీ చేసి, నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల మధ్య జరుగుతున్న అంతర్గత విభేదాలపై విచారణ చేసినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు నాణ్యవంతమైన విద్యతో పాటు, పౌష్టికాహారాన్ని అందించాలని అన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను ప్రతీరోజు రెండుసార్లు శుభ్రం చేయాలని సూచించారు. గ్రంథాలయం పరిసరాల్లో మొక్కలను పెంచి పచ్చదనాన్ని పెంపొందించాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పాండు, నయాబ్ తహసీల్దార్ పరమేష్, ఎంఈవో ఉషారాణి, ఎంపీవో రాజు, పంచాయతీ కార్యదర్శి రవితేజరెడ్డి, హెచ్‌ఎం శ్రీదేవి, ఇన్‌చార్జి లైబ్రేరియన్ తేజ తదితరులున్నారు.

కొనసాగుతున్న ఆడిట్

» రెవెన్యూ విభాగంలో రికార్డుల పరిశీలన

» అధికారి లేకుండానే సాగుతున్న తనిఖీ



రెవెన్యూ విభాగంలో కొనసాగుతున్న ఆడిట్

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 17 : వనపర్తి మునిసిపాలిటీలో 2022-23 సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ కొనసాగుతోంది. గడిచిన వారం రోజులుగా కొనసాగుతున్న ఆడిట్‌లో మునిసిపాలిటీకి వచ్చిన ఆదాయం, చేసిన ఖర్చులు, సిబ్బంది జీతభత్యాల వివరాలను ఆడిట్ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. శనివారం మునిసిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో ఆడిట్ నిర్వహించారు. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నిర్వహించినప్పుడు కూడా కొంతమంది సిబ్బంది చేతివాటం ప్రదర్శించారని లెక్కలు తేల్చారు. మునిసిపల్ ఆదాయాన్ని జేబులో వేసుకొని సిబ్బంది నుంచి వాడుకున్న దాదాపు రూ.20 లక్షల వరకు అమౌంట్‌ను రికవరీ చేశారనే విషయం కూడా తెలిసిందే. ఈసారి నిర్వహిస్తున్న ఆడిట్‌లో అవకతవకలకు పాల్పడిన సిబ్బంది, అధికారులు ఎంతటివారైనా సరే వారి వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఆడిట్ అధికారి యూసుఫ్‌హైమద్, ఆడిట్ బృందం సభ్యులు శిల్ప, సుజాత పేర్కొన్నారు. మరి ప్రస్తుతం జరుగుతున్న ఆడిట్‌లో ఎలాంటి అవకతవకలు బయటపడతాయో వేచి చూడాలి.

ఘనంగా మాజీ ముఖ్యమంత్రి జన్మదినం



వనపర్తి మార్కెట్‌యార్డులో రైతులతో కలిసి కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వనపర్తి అర్బన్/పెబ్బేరు/పాన్‌గల్/అమరచింత/మదనాపురం/కొత్తకోట/ఖిల్లాఘనపురం/ఆత్మకూరు, ఫిబ్రవరి 17 : బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు జన్మదినాన్ని జిల్లాలో శనివారం ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో రైతులు, పార్టీ నాయకులతో కలిసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మునిసిపల్ చైర్మన్ గట్టుయాదవ్ కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, పట్టణ అధ్యక్షుడు ఆవుల రమేష్, గ్రంథాలయ చైర్మన్ బి.లక్ష్మయ్య, బీఆర్‌ఎస్ మీడియా సెల్ కన్వీనర్ అశోక్, పట్టణ అధ్యక్షుడు సూర్యవంశం గిరి తదితరులు పాల్గొన్నారు. పెబ్బేరు పట్టణంలోని సుభాష్‌చౌరస్తాలో బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు దిలీప్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు వనంరాములు కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వ వైద్యశాలలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పాన్‌గల్‌లోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం పీహెచ్‌సీ, కేజీబీవీలలో బ్రెడ్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గంధం లక్ష్మయ్య, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు తిరుపతయ్యనాయుడు, వెంకటయ్యనాయుడు, మండల కోఆప్షన్ సభ్యుడు అలీం, సింగిల్ విండో డైరెక్టర్ ప్యాట బాలరాజు, మాజీ సర్పంచులు సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, చంద్రునాయక్, నాగేశ్వర్‌నాయుడు, నరసింహ, బాలస్వామి, మేస్త్రీ రాములు, తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు. అమరచింతలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజేందర్ సింగ్ ఇంట్లో కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్పర్సన్ మంగమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు, కౌన్సిలర్లు లెనిన్, సింధు, షానవాజ్, కమలాకర్, జింక రవి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు. మదనాపురంలో బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్, ఎంపీపీ జన్ను పద్మావతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్టియాదగిరి, నాయకులు పాల్గొన్నారు. కొత్తకోటలోని చౌరస్తాలో బీఆర్‌ఎస్ నాయకులు కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం కేసీఆర్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. కనిమెట్ట గ్రామంలో మాజీ వైస్ ఎంపీపీ మల్లేష్ ఆధ్వర్యంలో శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, మునిసిపల్ చైర్‌పర్సన్ సుకేశిని, ఎంపీపీ గుంతమౌనిక, వైస్ ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు పాల్గొన్నారు. ఖిల్లాఘనపురంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య ఆధ్వర్యంలో నాయకులు కేక్ కట్ చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు సామ్యనాయక్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఆత్మకూరులోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో ఎంపీపీ బంగారం శ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్ కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు.

అబద్ధాలతో అభివృద్ధిని మార్చలేరు

» జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

మదనాపురం, ఫిబ్రవరి 17 : దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన అభివృద్ధిని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తన అబద్ధాలతో మార్చలేరని జడ్పీటీసీ సభ్యుడు కృష్ణయ్యయాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే దేవరకద్రలో వంద పడకల ఆసుపత్రి, కొత్తకోటలో 30 పడకల ఆసుపత్రి నిర్మాణాలను మాజీ ఎమ్మెల్యే తన మాటలతో మభ్యపెట్టారని అనడం సంస్కారం కాదని అన్నారు. దేవరకద్ర, కొత్తకోట ఆసుపత్రికి అధికారికంగా ఉత్తర్వులు రావడమే గాక టెండర్లు కూడా పూర్తయిన విషయం ఎమ్మెల్యే తెలుసుకోవాలని అన్నారు. ప్రజలు అధికారం కట్టబెడితే గతం కంటే ఇంకా మెరుగ్గా పరిపాలన సాగించాలని, అది చేతకాకనే మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చేసిన అభివృద్ధిపై జీఎంఆర్ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. సోషల్ మీడియాలో కాంగ్రెస్ కార్యకర్తలు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులపై ఎన్ని పోస్టులు పెట్టినా కేసు లు పెట్టకుండా, తమ పార్టీ వారు పెడితే పోలీసులపై ఒత్తిడి చేసి కేసులు పెడుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్నామని ఇలాంటి పసలేని కేసులకు బీఆర్‌ఎస్ కార్యకర్తలు భయపడరనే విషయం ఎమ్మెల్యే జీఎంఆర్ గుర్తించుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్టియాదగిరి, ఎంపీపీ జన్ను పద్మావతి, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్లు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, వెంకట్ నారాయణ, మాజీ సర్పంచు జయంతి, బాలకృష్ణ, మాసన్నయాదవ్, దేశి వెంకటేష్‌యాదవ్ తదితరులున్నారు.

మేడారం జాతరకు వనపర్తి డిపో బస్సులు

వనపర్తి టౌన్, ఫిబ్రవరి 17 : రాష్ట్రంలో ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించే మేడారం జాతర కోసం వరంగల్ రీజినల్ డిపోకు వనపర్తి డిపో నుంచి 40 బస్సులను కేటాయించామని వనపర్తి డిపో మేనేజర్ వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19 నుంచి 25వ తేదీ వరకు కేవలం హైదరాబాద్, కర్నూల్, కొత్తకోట మీదుగా మహబూబ్‌నగర్, ఆత్మకూర్, ఘనపురం, గద్వాల వంటి కొన్ని రూట్లల్లోనే బస్సులు తిరుగుతాయని, మిగతా రూట్లల్లో బస్సుల ప్రయాణానికి అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు. ప్రయాణికులు సహకరించాలని కోరారు.

పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలు పంపిణీ

ఖిల్లాఘణపురం, ఫిబ్రవరి 17 : మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలకు లైబ్రరీ పుస్తకాలను శనివారం ఎంఈవో ఉషారాణి పంపిణీ చేశారు. మండలంలోని జడ్పీహెచ్‌ఎస్, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల పఠన సామర్థ్యాలను పెంపొందించడానికి లైబ్రరీ పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. లైబ్రరీ పీరియడ్‌లో విద్యార్థుల నైపుణ్యాలను బట్టి పుస్తకాలు అందుబాటులో ఉంచి ఉపాధ్యాయులు చదివిస్తారని తెలిపారు. సీఆర్పీలు వెంకటేష్, రాములు పార్వతమ్మ, ఎంఆర్‌సీ సిబ్బంది తిరుపతయ్య, అర్జున్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

మదనాపురం, ఫిబ్రవరి 17 : బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సమగ్ర బాలల పరిరక్షణ సమితి సభ్యురాలు జీవిత అన్నారు. శనివారం మండలంలోని అజ్జకొల్లు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు చైల్డ్‌లైన్-1098 గురించి ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులందరు ఉపాధ్యాయులు బోధించిన పాఠ్యాంశాన్ని శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. అమ్మాయిలు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ గురించి అవగాహన కలిగి ఉండాలని, ప్రేమ ఆకర్షణకు గురికాకుండా, తమ జీవితాలను నాశనం చేసుకోకుండా తల్లిదండ్రుల కలలను సార్థకం చేయాలని కోరారు. అనంతరం పలు చట్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ రవిరాజు, 1098 సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దు

» స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్

వనపర్తి రూరల్, ఫిబ్రవరి 17 : అభం శుభం తెలియని వయసులోనే రోడ్డు ప్రమాదాలకు గురై జీవితాలను నాశనం చేసుకోవద్దు అని స్నేక్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు కృష్ణసాగర్ అన్నారు. శనివారం వనపర్తి మండల పరిధిలోని చిట్యాల శివారులోని ఓ రైస్‌మిల్లులో రెండు నాగుపాములను బంధించారు. అనంతరం హెల్మెట్ ధరించి, నాగుపాములతో వినూత్న ప్రదర్శన చేశారు. నాగుపాములు ఎంత విషపూరితమైనవో అంత మేలైనవన్నారు. పాములు కరిస్తే వాటి విషం మన శరీరానికి పారడానికి దాదాపు మూడుగంటల సమయం అవుతుందన్నారు. అంతలోపు దవాఖానాలకు వెళ్లి ప్రాణాలను రక్షించుకోగలం అని అన్నారు. అదేవిధంగా హెల్మెట్ లేకుండా వాహనాలు నడపొద్దని వాహనదారులకు సూచించారు. వాహనం నడిపేటప్పుడు కుటుంబ సభ్యులను గుర్తించుకొని కచ్చితంగా హెల్మెట్ ధరించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురామ్

వనపర్తి అర్బన్, ఫిబ్రవరి 17 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు బచ్చురామ్ అన్నారు. శనివారం వనపర్తి పట్టణంలోని ఆరవ వార్డులో గావ్ చలో బస్తీ కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు విజయ్‌కుమార్, రాయన్నసాగర్, శివ, అరవింద్ తదితరులున్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు

పాన్‌గల్, ఫిబ్రవరి 17 : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర బాల స్వస్తీయ కార్యక్రమంలో భాగంగా డైరెక్టర్ హరీష్ విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి, ఐరన్ పోలిక్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనతను అధిగమించడానికి విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కొండా శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ సతీష్, ఏఎన్‌ఎం నర్సమ్మ, ఫిజికల్ ఎడ్యుకేటర్ మహేశ్వర్‌రెడ్డి, ఆశ కార్యకర్తలు కవిత, అలివేల తదితరులున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుని ఎన్నిక

గోపాల్‌పేట, ఫిబ్రవరి 17 : బీజేపీ మండల అధ్యక్షుడిగా మండలంలోని ఏదుల గ్రామానికి చెందిన పెద్దిరెడ్డి తిరుపతిరెడ్డిని నియమించారు. శనివారం పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నారాయణ తిరుపతిరెడ్డికి నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ బీజేపీ చేసిన అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్లి ఓటు బ్యాంకు పెంచుతామని అన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడితో పాటు, మాజీ అధ్యక్షుడు అరవింద్‌రెడ్డిని నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకుడు శ్రీశైలం, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సీతారాములు, రాఘవేంద్ర తదితరులున్నారు.

రైతు సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

అమరచింత, ఫిబ్రవరి 17 : దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీపీఎం నాయకులు ఆర్‌ఎన్.రమేష్, అజయ్, వెంకటేష్‌లు పేర్కొన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధరతో పాటు, న్యాయబద్ధమైన డిమాండ్లతో ఢిల్లీలో నిరసన తెలుపుతున్న రైతులపై బీజేపీ ప్రభుత్వం అమానుషంగా వ్యవహరించడం సరికాదని విమర్శించారు. తక్షణమే రైతులపై దాడులను ఆపి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంతో పాటు, అక్రమ కేసులను ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా పడిపూజ

గోపాల్‌పేట, ఫిబ్రవరి 17 : మండలంలోని చెన్నూరు ముందలితండాలో శనివారం శివుని పడిపూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి కాశీనాథ్ ఇంటి ఆవరణలో పూజా కార్యక్రమం ఏర్పాటుచేశారు. మల్లికార్జునస్వామిని పూలతో అలంకరించి, పూజా కార్యక్రమం నిర్వహించారు. శివనామస్మరణతో తండా మారుమోగింది. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు, శివస్వాములు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'కిడ్నాప్‌లపై వస్తున్న వదంతులు నమ్మొద్దు'

కొత్తకోట, ఫిబ్రవరి 17 : చిన్నారుల కిడ్నాప్‌లపై వస్తున్న వదంతులను నమ్మొద్దని కొత్తకోట ఎస్సై మంజునాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు చిన్నపిల్లలను కిడ్నాప్ చేయడానికి గ్రామాల్లో తిరుగుతున్నారని సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. అలాంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. గుర్తు తెలియని వ్యక్తుల సంచారం కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలను కోరారు.